సాక్షి ఖమ్మం

ఆదివారం । 19 । నవంబర్ । 2023



జయం మనదే!

వరల్డ్‌కప్‌లో ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరగనుండగా భారత జట్టు విజయం సాధిస్తుందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 10లో



ఉమ్మడి జిల్లా క్రీడాజట్ల ఎంపిక

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లా స్థాయి టగ్ ఆఫ్ వార్, బాస్కెట్‌బాల్ జట్లను ఖమ్మంలో ఎంపిక చేశారు. 10లో

గరిష్టం / కనిష్టం
34° / 21°

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు భద్రాద్రి జిల్లాకు కేటీఆర్



నాలుగు చోట్ల రోడ్ షోలకు ఏర్పాట్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివారం రోడ్ షో నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నాలుగు నియోజకవర్గాల్లో జరిగే రోడ్ షోల్లో ఆయన పాల్గొంటారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో ఉదయం 11 గంటలకు భద్రాచలం చేరుకుంటారు. శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నాక పట్టణంలో జరిగే రోడ్ షోలో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం ఒంటి గంట కు ఇల్లెందుకు చేరుకుని బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ విజయాన్ని కాంక్షిస్తూ రోడ్ షో నిర్వహిస్తారు. అక్కడ కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ మాట్లాడుతారు. అనంతరం 2.30 గంటలకు కొత్తగూడెంలో, సాయంత్రం 4 గంటలకు అశ్వారావుపేటలో జరిగే రోడ్ షోలో కేటీఆర్ పాల్గొని బీఆర్ఎస్ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తారు.


24న ఖమ్మంలో...

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 24న ఖమ్మంలో జరిగే రోడ్ షోలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారు. ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ తరఫున నిర్వహించే ప్రచారానికి ఆయన హాజరవుతారు. 24వ తేదీన ఉదయం 10 గంటలకు ఖమ్మంలో కేటీఆర్ రోడ్ షో ఉంటుందని పార్టీ వర్గాలు వెల్లడించారు.

జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదం, స్వామి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించగా తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైరా రిజర్వాయర్‌లోకి సాగర్ జలాలు



తిమ్మారావుపేట ఎక్స్‌కేప్ లాకుల ద్వారా రిజర్వాయర్‌లోకి వస్తున్న జలాలు

వైరా: ఎట్టకేలకు వైరా రిజర్వాయర్‌లోకి అధికారులు పాలేరు నుంచి సాగర్ జలాలను విడుదల చేశారు. ఏన్కూరు మండలం తిమ్మారావుపేట ఎక్స్ కేప్ లాకుల ద్వారా నీటిని విడుదల చేయగా రిజర్వాయర్‌లోకి జలాలు చేరుతున్నాయి. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 9.9 అడుగుల మేర నీరు ఉండగా, పంటలు ఎండిపోతున్నాయని ఇటీవల రైతులు, అఖిలపక్షం నాయకులు ఆందోళన చేపట్టారు. ఈక్రమంలో పాలేరు నుంచి వారం పాటు నీరు విడుదల చేయాలని నిర్ణయించగా.. తాగు, సాగు అవసరాలకు వినియోగించనున్నారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభం



సీసీఐ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కారేపల్లి: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి కొనుగోళ్లను కారేపల్లిలో అధికారులు శనివారం ప్రారంభించారు. కారేపల్లిలోని లక్ష్మీప్రియ కోటెక్స్ జిన్నింగ్ మిల్లులో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయగా, జిల్లా మార్కెటింగ్ అధికారి అబ్దుల్ అలీం, ఇల్లెందు మార్కెట్ కార్యదర్శి నరేష్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, 1.20లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా సీసీఐ ద్వారా కొనుగోళ్లు చేపడుతున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎనిమిది శాతం తేమ మించకుండా తీసుకొస్తే క్వింటాకు రూ.7,020 ధర లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు, అధికారులు కిరణ్, వెంకటేశ్వర్లు, సుంకర కోటేశ్వరరావు, తుమ్మలపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యూహాలు.. ప్రతివ్యూహాలు

జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా వ్యూహ ప్రతివ్యూహాలకు పదును పెడుతున్నారు. ప్రచారానికి మిగిలిన సమయాన్ని వృథా చేయకుండా ప్రజల్లోకి వెళ్తున్నారు. అలాగే గెలుపోటములను ప్రభావితం చేయగలిగిన నాయకులు, కార్యకర్తలతో టచ్‌లో ఉంటూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల బలాబలాలపై ఆరా తీస్తూ పోల్ మేనేజ్‌మెంట్‌పై జోరుగా మంతనాలు సాగిస్తున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం



విజయమే లక్ష్యంగా అభ్యర్థుల ప్రణాళికలు

- సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా కసరత్తు
- ప్రచారంతోపాటు సమీకరణపై ప్రత్యేక దృష్టి
- ప్రజాబలం కలిగిన నాయకులతో నిరంతరం మంతనాలు
- స్వతంత్ర అభ్యర్థుల ప్రభావంపై ఆరా

అగ్రనేతలతో ఆకట్టుకునేలా...

పోటీలో ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం అభ్యర్థులు, నాయకులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఓవైపు అభ్యర్థులు.. మరో పక్క పార్టీ శ్రేణులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. బీఆర్ఎస్ నుంచి సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొనగా.. మంత్రి కేటీఆర్ ఆదివారం భద్రాద్రి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో జరిగే రోడ్డు షోలకు హాజరుకానున్నారు. అలాగే, ఖమ్మంలో 24వ తేదీన జరిగే రోడ్డు షోకు కేటీఆర్ హాజరుకానున్నారని పార్టీ వర్గాలు వెల్లడించారు. ఇక ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ శుక్రవారం పినపాక నియోజకవర్గం మణుగూరులో కార్నర్ మీటింగ్‌లో పాల్గొనడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. సీపీఎం కూడా మాజీ సీఎం మాణిక్ సర్కార్, సీతారాం ఏచూరి వంటి అగ్రనేతలను రప్పిస్తోంది.

ఓటు బ్యాంక్ ఎంత

బరిలో నిలిచిన ఇతర పార్టీలు, స్వతంత్రుల పట్టు, ఓటు బ్యాంకు తదితర అంశాలపై అభ్యర్థులు అంచనాలు వేస్తున్నారు. ప్రధానంగా స్వతంత్ర అభ్యర్థులపై దృష్టి సారించి ఎవరికి నష్టం జరుగుతుందనే అంశాన్ని ఆరా తీస్తున్నారు. గెలుపోటములను ప్రభావితం చేయగలిగే అంతగా ఓట్లు కొల్లగొట్టే స్థాయిలో స్వతంత్రులు ఉంటే... వారితో ఎవరికి నష్టం జరుగుతుందో అభ్యర్థులు తెలుసుకుంటున్నారు. ఒకవేళ తమకే నష్టమని భావిస్తే స్వతంత్రులతో మాట్లాడి తమ వైపు తిప్పుకోవడం.. ప్రత్యర్థికే నష్టం అనుకుంటే సదరు స్వతంత్ర అభ్యర్థి ప్రచారాన్ని ఉధృతం చేసేలా సహకరించాలనే భావనకు వస్తున్నట్లు తెలిసింది.

ఎన్నికల మంత్రాంగం

అభ్యర్థులు ప్రధానంగా ఎన్నికల మంత్రాంగంపై దృష్టి సారించారు. పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్ది ఏ పోలింగ్ స్టేషన్‌లో ఎన్ని ఓట్లు ఉంటాయి.. అక్కడ ఏజెంట్లుగా ఎవరిని నియమించాలనే అంశంపై ఆరా తీస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రధాన అనుచరులతో క్షేత్రస్థాయిలో పరిస్థితులను బేరీజు వేస్తూ అందుకు అనుగుణంగా నిర్ణయాలను తీసుకుంటున్నారు. ఓటర్లను ప్రభావితం చేయగలిగే నాయకులకే బాధ్యతలు అప్పగించి రోజూ పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. తాము గెలిస్తే చేసే పనులను ఆయా నాయకులకు వివరించి ఓటర్లకు చేరవేసేలా దిశానిర్దేశం చేస్తున్నారు.

బలం.. బలహీనతలపై ఆరా

ప్రజల్లో విస్తృతంగా పర్యటిస్తున్న అభ్యర్థులు.. తమ గెలుపునకు కలిసొచ్చే ఏ అంశాన్నీ విడిచిపెట్టకుండా సమీక్షిస్తున్నారు. ప్రచారానికి పది రోజుల సమయమే ఉండడంతో అనుచరులతో నిత్యం వ్యూహ, ప్రతివ్యూహాలపై చర్చిస్తున్నారు. ఏ గ్రామం, ఏ మండలం, ఏ డివిజన్‌లో ఎక్కువ ఓట్లు వస్తాయి.. ఎక్కడ తక్కువగా పోల్ అవుతాయనే లెక్కలు వేసుకుంటున్నారు. బలం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఓట్లను కొల్లగొట్టేందుకు ఏ నాయకుడిని తమ వైపు తిప్పుకోవాలి, అక్కడ ప్రచారం ఎలా చేయాలనే అంశంపై చర్చిస్తూ... ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి బలం, బలహీనతలపై కూడా దృష్టి సారిస్తున్నారు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ – కాంగ్రెస్ మధ్యే పోటీ ఉన్నట్లు తెలుస్తుండగా అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా హోరాహోరీగా పోరాడుతున్నారు.

జంగ్ తెలంగాణ

డిజిటల్ లావాదేవీలపై ప్రత్యేక దృష్టి



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ వారియర్

- యువత డబ్బుకు ఆశపడి ఇబ్బందులు తెచ్చుకోవద్దు
- కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్

ఖమ్మం సహకారనగర్: శాసనసభ ఎన్నికల నేపథ్యాన డిజిటల్ లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం సాయంత్రం ఆయన పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా దేశంలోనే అత్యధికంగా ఖర్చు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని ఎన్నికల సంఘం గుర్తించిందని తెలిపారు. ఈ నేపథ్యాన ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు ప్రయత్నిస్తున్న పార్టీలను అడ్డుకునేందుకు డిజిటల్ లావాదేవీలపై దృష్టి సారించామని చెప్పారు. ఈమేరకు ఓ నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్త ఖాతా నుంచి 40మందికి రూ.2,69,256, అదే నియోజకర్గంలోని ఓ బీఆర్ఎస్ కార్యకర్త ఖాతా నుంచి 43మందికి రూ.1,07,433 ట్రాన్స్‌ఫర్ చేసినట్లు కేసులు నమోదు చేశామని తెలిపారు. ఒక వ్యక్తి నుంచి పది మందికి పైగా నగదు లావాదేవీలు జరిగితే బ్యాంకర్ల ద్వారా వివరాలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెల్లడించారు.

ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దు

తాత్కాలికంగా అందే నగదుకు ఆశపడి యువత, విద్యార్థులు ఇబ్బందుల పాలుకావొద్దని కలెక్టర్, సీపీ సూచించారు. ఎన్నికల నేపథ్యాన వివిధ పార్టీల నాయకులు నగదును క్షేత్రస్థాయికి చేర్చి పంపిణీకి యత్నిస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని, అలాకాకుండా కేసులు నమోదైతే భవిష్యత్‌లో ఉద్యోగావకాశాలు దూరమవుతాయని చెప్పారు. కాగా, పలువురు ఓటర్లకు బంగారు, వెండి ఇచ్చేందుకు కొందరు యత్నిస్తున్నారన్న సమాచారంతో బంగారం షాపుల్లో ఆర్డర్లపై నిఘా వేశామని తెలిపారు. ఓటర్లు కూడా ఎవరైనా ప్రలోభాలకు యత్నిస్తే వీడియోలు, ఫొటోలు తీసి సీ–విజిల్ యాప్‌కు ఫిర్యాదు చేయాలని కలెక్టర్, సీపీ సూచించారు.

రూ.5.63 కోట్ల నగదు సీజ్

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన చెక్ పోస్టుల వద్ద ఇప్పటివరకు రూ.7,24,33,650 విలువైన నగదు, బంగారు, వెండి ఆభరణాలు, గంజాయి, ఇతర సామగ్రిని స్టీల్‌బాక్స్‌లు ఇతర వస్తువులను సీజ్ చేశామని కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్ తెలిపారు. ఇందులో 248కేసులకు సంబంధించి రూ.5,63,55,937 నగదు ఉందని చెప్పారు. అలాగే, వివిధ కేసులకు సంబంధించిన 9వేలకు మందిని బైండోవర్ చేశామని తెలిపారు. అంతర్రాష్ట్ర, అంతర్ జిల్లా చెక్‌పోస్టులు 18ఏర్పాటుచేయగా... అవసరాలకు అనుగుణంగా తనిఖీ బృందాలను పెంచుతూ నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వారు వివరించారు.

డబ్బు, మద్యం ప్రభావాన్ని నియంత్రించాలి

అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావాన్ని నియంత్రించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి కలెక్టరేట్‌లో ఆయన పోలీస్ శాఖ, బ్యాంకులు, ఇన్‌కం ట్యాక్స్ అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలోని చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు మరింత విస్తృతం చేయాలని తెలిపారు. ఓటర్లకు పంపిణీ చేసేలా గోదాంలు, ఫంక్షన్ హాళ్లలో సామగ్రి నిల్వ చేసే అవకాశం ఉన్నందున నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. అనుమానాస్పద లావాదేవీల నివేదికను బ్యాంకర్లు సమర్పించాలన్నారు. అదనపు డీసీపీ ప్రసాదరావు, డీసీఓ విజయకుమారి, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్రరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అందరం యుద్ధం చేయాల్సిందే..

ఆత్మీయ సమ్మేళనంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన నాయకులు

సత్తుపల్లి/పెనుబల్లి: తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్న నేపథ్యాన కాంగ్రెస్‌కు అనుకూలంగా తీర్పు చెబుతారనే నమ్మకముందని పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం పెనుబల్లి మండలం కుప్పెనకుంట్లలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ పోలింగ్‌కు సమయం తక్కువగా ఉన్నందున అందరం సమష్టిగా యుద్ధం చేయాల్సిన అవసరముందని తెలిపారు. పార్టీ శ్రేణులంతా కష్టపడితే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవడం సులువవుతుందని చెప్పారు. ధనబలం ముందు ప్రజాబలమే గెలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రమంతటా కాంగ్రెస్ గాలి వీస్తున్నందున సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలు చైతన్యంతో తీర్పు చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈమేరకు కాంగ్రెస్ కార్యకర్తలు ఆరు గ్యారంటీలను గడపగడపకు తీసుకెళ్లి అభ్యర్థుల విజయంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. అనంతరం ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడగా సత్తుపల్లి అభ్యర్థి మట్టా రాగమయి, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, వక్కలగడ్డ సోమచంద్రశేఖర్, మువ్వా విజయబాబు, తోట సుజలరాణి, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, నున్నా రామకృష్ణ, సీతారామారావు, ఉడతనేని అప్పారావు, దండు ఆదినారాయణ, బొంతు శ్రీనివాసరావు, ఎస్‌కె మౌలాలీ, చల్లారి వెంకటేశ్వరరావు, గాదె చెన్నారావు, మున్వర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి మీ కళ్ల ముందే ఉంది...

- ప్రజలు విజ్ఞతతో ఓటు వేయండి
- బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్



రోడ్ షోలో మాట్లాడుతున్న పువ్వాడ అజయ్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో జరిగిన అభివృద్ధి ప్రజల కళ్ల ముందే కనిపిస్తోందని.. ఓటర్లు విజ్ఞతతో అన్ని విషయాలను ఆలోచించి తనను మరోమారు గెలిపించాలని రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ కోరారు. ఖమ్మంలోని పలు డివిజన్లలో ఇంటింటి ప్రచారం చేసిన ఆయన రోడ్ షోల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పువ్వాడకు పలుచోట్ల మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. ఆయా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ కాంగ్రెస్ వాళ్లు అనేక మాటలు చెబుతుండగా, తప్పుడు హామీలతో మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా ఖమ్మంను అన్నిరంగాల్లో తీర్చిదిద్దిన తనను ప్రజలు మరోమారు గెలిపిస్తారనే నమ్మకం ఉందని తెలిపారు. ఖమ్మం ఇప్పటికే అన్ని రంగాల్లో ముందు నిలవగా... మరో ఐదేళ్లు అవకాశం ఇస్తే హైదరాబాద్‌తో సమానంగా అభివృద్ధి చేస్తానని పువ్వాడ వెల్లడించారు.కాగా, కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన సమయంలో ఖమ్మంకు ఏం చేశారో చెప్పడానికి ఒక్క పని లేదని ఎద్దేవా చేశారు.

నేడు ఆర్ఎస్ పర్యటన



ప్రవీణ్‌కుమార్

వైరా: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఆ పార్టీ అభ్యర్థి తరఫున వైరాలో జరిగే రోడ్ షో, కార్నర్ మీటింగ్ పాల్గొననున్నారు. వైరాలో బీఎస్పీ నుంచి బానోత్ రాంబాబునాయక్ పోటీలో ఉన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ హెలీకాప్టర్ ద్వారా వైరాకు చేరుకుని సభల్లో పాల్గొంటారు. ఆతర్వాత జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఆర్ఎస్ తమ పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయనున్నారు.

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారి ఆర్జిత సేవల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సమష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి



అవార్డులు అందుకున్న ఉద్యోగులతో ఆర్ఎం వెంకన్న, అధికారులు

- ఆర్టీసీ ఎదుగుదలలో డ్రైవర్, కండక్టర్లే కీలకం
- ఖమ్మం రీజినల్ మేనేజర్ వెంకన్న

సత్తుపల్లిరూరల్: ఉద్యోగుల సమష్టి కృషితోనే సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్టీసీ ఖమ్మం రీజినల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న తెలిపారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఉద్యోగులకు రీజినల్ స్థాయి ప్రగతి చక్ర అవార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ.. ఆర్టీసీ అభివృద్ధికి డ్రైవర్లు, కండక్టర్లే కీలకమని తెలిపారు. ఉద్యోగులు బాధ్యతతో వ్యవహరిస్తే ఆదాయం పెరుగుతుందని చెప్పారు.

25మందికి అవార్డులు..

ఖమ్మం రీజినల్ పరిధిలోని ఏడు డిపోల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పది మంది డ్రైవర్లు, ఏడుగురు కండక్టర్లు, ముగ్గురు టిమ్స్ డ్రైవర్లు, ఐదు అద్దె బస్సుల డ్రైవర్లు, ముగ్గురు మెకానిక్‌లను ఆర్ఎం సన్మానించారు. అదేవిధంగా ఉత్తమ బస్ స్టేషన్‌గా ఎంపికైన ఖమ్మం పాత బస్టాండ్ డిపో మేనేజర్‌ను సత్కరించారు. రీజియన్ నుంచి 25 మంది అవార్డులకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రగతిచక్ర అవార్డులు పొందిన ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకొని మిగతా ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కాగా, త్వరలోనే కొత్తగూడెం బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ డిస్పెన్సరీ ఏర్పాటు చేస్తామని ఆర్ఎం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి, ఖమ్మం, భద్రాచలం, మణుగూరు డిపో మేనేజర్లు యు.రాజ్యలక్ష్మి, శ్రీనివాసరావు, రామారావు, స్వామి, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- ప్రలోభాలు ఎదురైతే ఫిర్యాదు చేయండి
- లకారం ట్యాంక్ బండ్‌పై ఓటర్లకు అవగాహన



ఓటరు అవగాహన కార్యక్రమంలో బెలూన్లు ఎగురవేస్తున్న అధికారులు

ఖమ్మం మయూరిసెంటర్: ఈనెల 30న జరిగే పోలింగ్ ప్రతీఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఖమ్మం, పాలేరు అసెంబ్లీ ఎన్నికల సాధారణ పరిశీలకులు తుషార్ కాంత మహంతి సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, ఎన్నికల పోలీస్ పరిశీలకులు బ్రిజేష్ కుమార్ రాయ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి శనివారం ఆయన లకారం ట్యాంక్‌బండ్‌పై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహంతి మాట్లాడుతూ ఓటు భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఎవరు కూడా ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే, ప్రలోభాలకు గురిచేసే వారి సమాచారాన్ని సీ విజిల్ యాప్ ద్వారా అధికారులకు చేరవేయాలని కోరారు. అనంతరం ట్యాంక్ బండ్‌పై ఎన్‌టీఆర్ పార్క్ వద్ద సెల్ఫీ పాయింట్‌లో అధికారులు ఫొటోలు దిగడమేకాక సంతకాలు సేకరించి ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. స్వీప్ జిల్లా నోడల్ అధికారి కె.శ్రీరాంతోపాటు అదనపు డీసీపీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఈమేరకు ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ.గౌతమ్‌శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఈవీఎంల భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్, లెక్కింపు రోజును బారికేడ్లు, టేబుళ్ల ఏర్పాటు, భద్రతపై ఆరా తీసి సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, అదనపు డీసీపీ ప్రసాద్‌రావు, వివిధ శాఖల అధికారులు శ్రీనివాసులు, సుమ, శ్యాంప్రసాద్, విశ్వనాథ్, బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భద్రాద్రి బ్యాంకులో సహకార వారోత్సవాలు



రాజయ్యను సత్కరిస్తున్న భద్రాద్రి బ్యాంకు ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంలోని భద్రాద్రి కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం 70వ అఖిల భాతర సహకార వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ కోఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జ్ పి.రాజయ్య ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సహకార వ్యవస్థ సంస్కరణలు, ఆర్థిక, స్థిరమైన లక్ష్యాలు, బ్యాంకు పురోగతికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం బ్యాంకు సిబ్బంది రక్తదానం చేశారు. బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, సీఈఓ జీవీవీ.సత్యనారాయణ, డిప్యూటీ సీఈఓ డి.వేణుగోపాల్, మేనేజర్లు శ్యాం, రామారావు, నర్సింహారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచార ప్లానింగ్ కమిటీ కన్వీనర్‌గా రామ్మూర్తి



రామ్మూర్తినాయక్

ఖమ్మంరూరల్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార ప్లానింగ్ కమిటీ కన్వీనర్‌గా ధరావత్ రామ్మూర్తినాయక్ నియమితులయ్యారు. గతంలో కార్పొరేటర్‌గా పనిచేసిన ఆయన వైరా నుంచి పార్టీ టికెట్ ఆశించినా ఫలితం దక్కలేదు. ఈమేరకు ప్రచార ప్లానింగ్ కమిటీ కన్వీనర్‌గా నియమిస్తూ ఏఐసీసీ నాయకుడు కేసీ.వేణుగోపాల్ శనివారం ప్రకటన విడుదల చేశారు.

మదర్‌థెరిస్సా కళాశాలలో రక్తదాన శిబిరం



రక్తదాతలకు పండ్లు అందజేస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: మండలంలోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, లయన్స్‌క్లబ్, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీఐ సంగం వెంకటపుల్లయ్య, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దొడ్డా కృష్ణయ్య, క్యాంప్ చైర్మన్ కొత్తూరు సత్యనారాయణ, ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ, క్యాంప్ కోచైర్మన్ కె.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా 51 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.

మానవతా ధర్మమే నిజమైన భక్తిమార్గం

ఖమ్మంగాంధీచౌక్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడాన్ని భక్తిమార్గంగా భావించాలని గజల్ గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. ఖమ్మంలోని ఈశ్వరాంబ వృద్ధాశ్రమం ప్రాంగణంలో శనివారం రాత్రి నిర్వహించిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జయంతి వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. సత్య సాయిబాబా విద్యాసంస్థలు, ఆస్పత్రులు నిర్మించడమే కాక అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఆతర్వాత ఆయన అమ్మ, నాన్న, ప్రకృతి, పాఠశాల, భార్యాభర్తల బంధం, ఆప్యాయతలు, వృద్ధాప్యం తదితర అంశాలపై పాడిన గేయాలు అలరించాయి. శ్రీ సత్యసేవా సమితి కన్వీనర్ ఆలస్యం నర్సింహారావుతో పాటు గాయత్రి, లెనిన్ శ్రీనివాస్, నాళ్ల భాను చందర్, కేవీ.చారి తదితరులు పాల్గొన్నారు.

రూ.5.96 లక్షల నగదు స్వాధీనం

ఖమ్మంక్రైం: ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.5.96 లక్షల నగదును ఖమ్మం త్రీటౌన్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద చేపట్టిన తనిఖీల్లో నలుగురు వ్యక్తుల నుంచి ఈ నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

మున్సిపల్ కాంట్రాక్టర్‌పై కేసు?

లెక్కకు మిక్కిలి డిజిటల్ పేమెంట్లే కారణం

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రంలోని కవిరాజ్ నగర్‌కు చెందిన ఒక మున్సిపల్ కాంట్రాక్టర్ యూపీఐ ద్వారా లెక్కకు మిక్కిలిగా లావాదేవీలు జరగడంతో పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఆయన ఓ పార్టీ నేతల తరఫున డబ్బు పంపిణీ చేస్తున్నారనే సమాచారంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల ఫిర్యాదు మేరకు ఖమ్మం అర్బన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేసినట్లు సమాచారం. సదరు కాంట్రాక్టర్ నాయకుల తరఫున ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడంలో భాగంగా యూపీఐ ద్వారా నగదు చేరవేసినట్లు గుర్తించారని తెలిసింది. అయితే, ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,196

జయం మనదే !



నేడు వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్స్
- విజయం భారత్‌దే అంటున్న అభిమానులు
- పరాజయం ఎరగని జట్టు కప్ సాధిస్తుందని ధీమా

ఖమ్మంస్పోర్ట్స్: ఈ వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌ల్లో భారత జట్టు అప్రతిహతంగా విజయ పరంపర కొనసాగిస్తోంది. ఆడిన పది మ్యాచ్‌ల్లోనూ ప్రత్యర్థులకు చుక్కలు చూపించి విజయాలు కైవసం చేసుకుంది. సెమీఫైనల్‌లోనూ సత్తా చాటడంపై అభిమానుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా బ్యాట్స్‌మెన్లతో పాటు బౌలర్లు కూడా ప్రతిభకు తగిన విధంగా రాణిస్తుండడంతో భారత్‌కు ఇప్పటివరకు ఎదురులేకుండా పోయింది. అయితే, ఆదివారం ఫైనల్స్ జరగనుండడం, ప్రత్యర్థి ఆస్ట్రేలియా కావడంతో అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అయినప్పటికీ భారత జట్టులో ఏడో నంబర్ వరకు బ్యాట్‌మెన్ సత్తా చాటుతుండడం కలిసొస్తుందనే నమ్మకంతో ఉన్నారు. మరోపక్క షమి వంటి బౌలర్లు కుదనం కలగలిపి కప్ సాధించడం ఖాయమనే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు

వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ భారత్ – ఆస్ట్రేలియా నడుమ ఆదివారం జరగనుంది. ఈ మ్యాచ్ కోసం అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో ఇళ్లలోనే మ్యాచ్ చూసేందుకు పలువురు సిద్ధమయ్యారు. మరికొందరు మాత్రం స్నేహితులతో కలిసి మ్యాచ్ చూసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంకొందరు హోటళ్లలో గదులు బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా వరల్డ్ కప్‌లో మొదటి నుంచి పరాజయం ఎరగకుండా దూసుకెళ్తున్న భారత జట్టు ఫైనల్స్ లోనూ అదే స్థాయి సత్తా చాటి కప్ గెలుచుకోవాలని అభిమానులంతా ఆశిస్తున్నారు.

బ్యాటింగ్ ఆర్డర్ బాగుంది



జట్టు బ్యాటింగ్ ఆర్డర్ బాగుంది. అందరూ ఫైనల్స్‌లో ఇదే తరహా ఆటతీరు కనబరిస్తే సునాయసనంగా కప్ మన సొంతమవుతుంది. ఇప్పటి వరకు పది మ్యాచ్‌ల్లో అందరూ సమష్టిగా రాణించారు. అదేస్థాయిలో ఆడితే మూడోసారి మనం కప్ సాధించడం ఖాయం.

– టి.సునీల్‌కుమార్‌రెడ్డి, డీవైఎస్ఓ

ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్లను నిలువరించాలి



ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్లను నిలువరిస్తే భారత్ విజయావకాశాలు మెరుగవుతాయి. భారత బౌలర్లు సమష్టిగా రాణించాలి. ఏదిఏమైనా 1983, 2011 మాదిరిగానే ఈ ఏడాది కూడా మన జట్టు కప్ సాధిస్తామని నమ్మకముంది. ప్రధానంగా ఒత్తిడి లేకపోవడం మన జట్టుకు కలిసొస్తుంది.

– ఎం.డీ.మసూద్ పాషా, క్రికెట్ అసోసియేషన్ జిల్లా కోఆర్డినేటర్

టాసే కీలకం..



భారత జట్టు ఇప్పటివరకు అన్ని మ్యాచ్‌ల్లో అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించింది. ఇదే తరహా ఆటతీరు ఫైనల్స్‌లో కొనసాగిస్తే కప్ సాధించడం ఖాయం. టాస్ విజయమే భారత్ బ్యాట్స్‌మెన్‌లు, బౌలర్లకు కీలకం కానుంది. టాస్ గెలిస్తే కప్ కూడా సాధించినట్లే.

– జోజిచాకో, సీనియర్ క్రికెటర్

బౌలర్లు విఫలం కావొద్దు...



ఆస్ట్రేలియా జట్టును తక్కువగా చూడొద్దు. మన బౌలర్లు విఫలమైతే కష్టాలు ఎదురవుతాయి. అదే బౌలర్లు సత్తా చాటితే మ్యాచ్ వన్‌సైడ్ అవుతుంది. ప్రధానంగా బౌలర్లపైనే విజయం ఆధారపడి ఉంది. ముందుగా భారత్ బ్యాటింగ్ తీసుకుంటే మంచిదని నా అభిప్రాయం.

– ఎం.డీ.మతిన్, క్రికెట్ కోచ్

వరల్డ్‌కప్ మనదే..



భారత్ ఆడిన ప్రతీ మ్యాచ్‌లో అప్రతిహతమైన విజయాన్ని అందుకుంది. ఇదేరీతిలో ఫైనల్స్‌లోనూ సత్తాచాటి కప్ అందుకునేందుకు అనుకూలమైన పరిస్థితులున్నాయి. బ్యాటింగ్, బౌలింగ్‌లో అందరూ ప్రతిభ కనబరుస్తున్నారు. అందుకే మనం కప్ సాధించడం ఖాయం.

– డాక్టర్ బి.వెంకన్న, సీనియర్ పీడీ

మిడిల్ ఆర్డర్‌పైనే ఆశలు



మిడిల్ ఆర్డర్‌లో కోహ్లి బ్యాట్స్‌మెన్‌గా వస్తే సెంచరీ సాధించడం ఖాయం. ఆస్ట్రేలియాను ఓడించి కప్ సాధించడం పెద్ద కష్టమేమీ కాదు. ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్లను మన బౌలర్లు నిలువరించే అవకాశముంది. కనీసం 50 పరుగుల తేడాతో కప్ సాధిస్తుందనే ఆశిస్తున్నాను.

– ఎం.డీ.ఫారుఖ్, సీనియర్ క్రికెటర్

ఫీల్డింగ్‌లోనూ రాణిస్తున్నారు..



మన జట్టులో అందరూ ఫీల్డింగ్‌లోనూ రాణిస్తున్నారు. ఫైనల్‌లో ప్రత్యర్థుల బాల్స్‌ను ఆపగలిగితే విజయం మనదే అవుతుంది. మ్యాచ్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాం. ఆదివారం పనులన్నీ వాయిదా వేసుకుని మ్యాచ్ చూడాలని కుటుంబమంతా నిర్ణయించుకున్నాం.

– ఏనిసెట్టి శ్రీనివాసరావు, ప్రైవేట్ అధ్యాపకుడు

గతంలో ఎన్నడూ చూడని జట్టు



నేను 40 ఏళ్లుగా క్రికెట్ చూస్తున్నా. కానీ ఇప్పటి మాదిరి జట్టు ఎప్పుడూ లేదు. జట్టులోని ప్రతీ ఆటగాడు రాణిస్తుండడం శుభపరిణామం. బ్యాటింగ్, బౌలింగ్‌లో ఏది ఎంచుకున్నా వంద శాతం సత్తా చాటుతున్నారు. మన జట్టుకు ప్రపంచ కప్ గెలిచే అన్ని అర్హతలు ఉన్నాయి.

– ఊటుకూరు సూర్యనారాయణ, ఎల్ఐసీ ఏజెంట్

వరుస వలసలతో బెంబేలు



కాంగ్రెస్‌లో చేరిన చింతకాని ఎంపీపీకి కండువా కప్పుతున్న భట్టి (ఫైల్)

- మధిరలో అధికార పార్టీకి నేతల ఝలక్
- నివురుగప్పిన నిప్పులా విభేదాలు

మధిర: మధిర నియోజకవర్గంలో అధికార బీఆర్ఎస్ పార్టీకి సొంత పార్టీ నేతలు ఝలక్ ఇస్తున్నారు. రోజురోజుకు కాంగ్రెస్‌లోకి వలసలు పెరుగుతున్నాయి. ఇక్కడ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలుచేయనున్న పథకాలపై విస్తృత ప్రచారం చేస్తుండడమే కాక పీసీసీ అధ్యక్షుడు, భట్టి సంతకాలతో కూడిన కరపత్రాలను గడపగడపకు పంపిణీ చేస్తున్నారు. దీనికి తోడు కాంగ్రెస్ అధికారంలో వస్తే మధిర నుంచి గెలిచే తనకు కీలక పదవి దక్కుతుందని.. తద్వారా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఆయన ప్రచారంలో చెబుతున్నారు. ఈమేరకు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు మూకుమ్మడిగా రాజీనామా చేసి వలస బాట పడుతున్నారు.

సమన్వయ లేమితో...

అధికార పార్టీ సుమారు రెండు నెలల ముందే అభ్యర్థిని ప్రకటించినా ద్వితీయ శ్రేణి నాయకులను సమన్వయం చేసుకోవడంలో విఫలమవడంతో ఈ పరిస్థితి ఎదురైందని తెలుస్తోంది. బీఆర్ఎస్‌లో అసంతృప్తితో ఉన్న నేతలను సముదాయించాలని, ఒకటి రెండు సార్లు చర్చించాలని సీఎం కేసీఆర్ ఆదేశించినా మధిర నియోజకవర్గంలో అలా జరగలేదు. ఫలితంగా తెలంగాణ ఉద్యమకారుడు బొమ్మెర రామ్మూర్తి రెబెల్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. మరోపక్క సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క ప్రచారాన్ని ముమ్మరం చేయడం వలసలకు ఇంకో కారణమవుతోంది. కాగా, కాంగ్రెస్ అభ్యర్థి భట్టి తోడు ఆయన కుటుంబీకులు, నాయకులు ప్రతిరోజు మండలాలను చుట్టేస్తుండగా.. బీఆర్ఎస్ తరఫున ప్రచారం ఇంకా ఊపందుకోకపోవం గమనార్హం.

వరుస చేరికలు

ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండ స్వామి సహా సర్పంచ్‌లు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఈ మండలంలో వర్గాలను సమన్వయం చేయలేకపోవడం, నియోజకవర్గానికి జెడ్పీ నిధులు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైనట్లు సమాచారం. అలాగే, బోనకల్, జానకీపురం, రాపల్లి సర్పంచ్‌లతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ గూటికి చేరారు. ఎర్రుపాలెం మండలంలో డీసీసీబీ డైరెక్టర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు సైతం కాంగ్రెస్ బాట పట్టారు. చింతకాని మండలంలో ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, సొసైటీ చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరడం గమనార్హం.

● ఆల్ ది బెస్ట్.. ఇండియా!



ఇండియా అక్షరాల రూపంలో విద్యార్థులు

వరల్డ్ కప్ టోర్నీలో భాగంగా ఆదివారం జరిగే ఫైనల్స్‌లో భారత జట్టు ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఈ సందర్భంగా ఇండియా జట్టు విజయం సాధించాలని మధిరలోని భరత్ విద్యాసంస్థల విద్యార్థులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల అధినేత శీలం వెంకటరెడ్డి ఆధ్వర్యాన శనివారం విద్యార్థులు 'ఇండియా'అక్షరాల రూపంలో కూర్చుని శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు, డీన్ రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉమ, స్రవంతి, నాగరాజు, పాషా, అజీం, రమేశ్, గణేశ్, శశికళ, హెప్సిబా, విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు. – మధిర

బాస్కెట్‌బాల్, టగ్ ఆఫ్ వార్ జట్ల ఎంపిక



టగ్ ఆఫ్ వార్ బాలికల జట్టుతో అధికారులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన శనివారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయి బాలబాలికల అండర్–17 బాస్కెట్‌బాల్, అండర్–14, 17 టగ్ ఆఫ్ వార్ జట్ల ఎంపిక చేశారు. ఈ ఎంపిక పోటీలకు రెండు జిల్లాల నుంచి 190 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలను పీఈటీలు కృష్ణమూర్తి, పీ.వీ.రమణ, కె.రామారావు, షఫీక్ అహ్మద్, రంజాన్, సైదేశ్వర్‌రావు, ఖుద్దూస్, రాజకుమారి, రవి పర్యవేక్షించగా.. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల వివరాలను జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శి కె.నర్సింహామూర్తి ప్రకటించారు. బాలుర అండర్–17 బాస్కెట్‌బాల్ జట్టుకు ఆర్.దివాకర్, ఎన్.జాయిదీప్, అకిబోయాం, సిద్ధు, అబిద్, వినయ్‌కుమార్, వెంకట్‌సాయి, లోకేశ్, ఖాదర్, సోహెల్, వెంకటరామ సత్యసాయికిరణ్, నవ్యనాథ్ ఎంపికకాగా, బాలికల జట్టుకు భాను స్పందన, రింశా, సాగరిక, మౌనిక, అఖిల, మంజుల, ధాత్రి, తియ, రూపా, ఆరిఫా, రిఫత్ జైన్ ఎంపకయ్యారని తెలిపారు. అలాగే, టగ్ ఆఫ్ వార్ అండర్– 14 బాలురు జట్టుకు భాను, శ్రవణ్, బి.మహేశ్, భార్గవ్, మోబిన్, తరుణ్, శ్రీనాథ్, అభిలాష, చైతన్య, అభిలాశ్, శివశంకర్, శరణ్‌సాయి, రాంచరణ్, బాలికల జట్టుకు దీక్షిత, కార్తీక, భవాని, మాధురి, సుప్రియ, మధు శ్రీ,అమూల్య, సంజన, ఉష, కల్యాణి, మేఘన, మనీషా ఎంపికయ్యారు. ఇక అండర్– 17 బాలుర జట్టులో తరుణ్, గణేశ్, మహేశ్, చరణ్, ప్రదీప్, వీరభద్రం, భాను ప్రసాద్, అరవింద్, చరణ్, సాయి మణికంఠ, వెంకటేశ్, ఫరీద్, మణికంఠ, జశ్వంత్, బాలికల జట్టులో మనీషా, భార్గవి, మౌక్షిత, వైష్ణవి, ఝూన్సీ శృతి, భవాని, పూజిత, అఖిల, శ్రీలక్ష్మీదుర్గ, హర్షిత, మౌనిక, అనుష్క ఎంపికయ్యారని వెల్లడించారు.

వధకు తరలిస్తున్న 150 పశువులు స్వాధీనం



గోవులను తరలిస్తున్న వాహనాలు

ఖమ్మంఅర్బన్/కల్లూరు: నోరులేని జీవాలను వాహనాల్లో పరిమితికి మించి కుక్కి తీసుకెళ్తుండగా అధికారులు అడ్డుకున్నారు. అయితే, తొక్కిసలాటలో అప్పటికే ఐదు పశువులు మృత్యువాత పడ్డాయి. వివరాలిలా..ఒడిశా నుంచి మూడు వాహనాల్లో 150 పశువులను తరలిస్తుండగా శుక్రవా రం రాత్రి కల్లూరు ఎస్సై పి.రఘు ఆధ్వర్యాన చేపట్టిన తనిఖీల్లో గుర్తించారు. అయితే, వాహనదారుల వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో గోవధ కోసం తరలిస్తున్నట్లు తెలియడంతో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శనివారం ఉదయం ఖమ్మం టేకులపల్లిలోని శ్రీవెంకటేశ్వర గోశాలకు వాహనాలను తీసుకొచ్చారు. నీరు, గ్రాసం ఇవ్వకుండా రవాణా చేయడంతో గోశాలలో దింపుతున్న క్రమంలో ఐదు పశువులు మృతి చెందినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా, మృతి చెందిన పశువులను అదే లారీల్లో తీసుకెళ్లగా.. గాయపడిన వాటికి పశు వైద్యులతో చికిత్స చేయించారు.

కాంగ్రెస్ ఫ్లెక్సీ చింపివేత

కామేపల్లి: ఇల్లెందు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య ప్రచార వాహన ఫ్లెక్సీని బీఆర్ఎస్ కార్యకర్త చింపేశాడు. మండలంలోని పింజరమడుగులో బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ ఎన్నికల ప్రచారం చేస్తుండగా, కాంగ్రెస్ ప్రచార వాహనం వచ్చింది. దీంతో టేకులపల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బానోత్ మోహన్ కాంగ్రెస్ వాహనంపై ఉన్న ఫ్లెక్సీని చింపేశాడు. ఈ అంశంపై కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, బీఆర్ఎస్ నాయకులు తిరిగి ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తామని చెప్పడంతో ఫిర్యాదు వెనక్కి తీసుకున్నారు.

ఏడు కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎక్సైజ్ పోలీసులు

మధిర: మధిర రైల్వేస్టేషన్‌లో శనివారం చేపట్టిన తనిఖీల్లో ఎక్సైజ్ అధికారులు ఏడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఉదయం కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చే సమయాన ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు చేయగా, స్టేషన్ సమీపాన ట్రాక్ పక్కన తెల్లని ప్లాస్టిక్ మూట కనిపించింది. దీన్ని పరిశీలించగా రూ.1.70లక్షల విలువైన ఏడు కేజీల గంజాయి ఉండడంతో సీజ్ చేశారు. అలాగే, మధిర ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో తనిఖీ చేసిన ఉద్యోగులు ఇద్దరి నుంచి 28.8 లీటర్లు నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్సైలు జి చంద్రశేఖర్, ఎం.శార్వాణి, సిబ్బంది సీహెచ్.గోపి, షేక్ రియాజ్, గంగ, జ్యోతి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్న వైనం

నేలకొండపల్లి: మండలంలోని కోరట్లగూడెంకు చెందిన ఓ యువకుడు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కోరట్లగూడెంకు చెందిన వి.గోపి(28) శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయాన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. అనంతరం ఆయన అరుస్తుండడమే కాక మంటలు రావడంతో స్థానికులు చేరుకుని చూసేసరికి పూర్తిగా కాలిపోయాడు. కుటుంబ కలహాలతోనే ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. కాగా, తల్లి సరుకులు తెచ్చేందుకు షాపుకు వెళ్లొచ్చే సరికి కొడుకు విగత జీవిగా మారడంతో బోరున విలపించింది.